

# ఎన్నికలొచ్చాయి, ఓట్లకోసం వచ్చే అభ్యర్థులను, పార్టీలను ఈ విషయాలు అడుగుదామా?

పార్లమెంట్‌కు అసెంబ్లీకి ఎన్నికలొచ్చాయి. దేశంలో ఎక్కడ చూసినా ఎన్నికల సందడే. పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ నాయకులు, పార్టీ అధినేతలు, వాళ్ళు గెలిస్తే, వాళ్ళ పార్టీని అధికారంలోకి తీసుకొస్తే ప్రజలకు స్వర్గం చూపిస్తామంటున్నారు. ఏమేమో హామీలు ఇస్తున్నారు. ప్రతిజ్ఞలు చేస్తున్నారు. ఇండ్లముందుకు వచ్చి దండాలు పెడుతున్నారు. ఎంతో ఆప్యాయతతో కౌగలించుకుంటున్నారు. గంటల వ్యవధిలోనే ఒక పార్టీ కండువ పారేసి, ఇంకో పార్టీ కండువ వేసుకుంటున్నారు. వాళ్ళు ఇంత కాలం ఉన్నపార్టీని, దాని నాయకుడ్ని తిడుతున్నారు. ప్రజలకోసమే మేము ఇట్లా చేయవలసి వస్తుందని చెప్పుతున్నారు. ఇది **ప్రతీ ఐదేళ్ళకు జరిగే తతంగం అని నవ్వుకుందామా?** కాదు, వాళ్ళు గెలిచిన తర్వాత ప్రజలకు కనపడరు కాబట్టి, వాళ్ళను కొన్ని **విషయాలు ఇప్పుడే అడుగుదాం, నిలదీద్దాం.** అందరు అభివృద్ధి చేస్తాం అంటున్నారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధి కావాలి అంటున్నారు. ప్రజల ఆకాంక్షలు కార్యరూపం దాల్చాలి కదా అంటున్నారు. ఈ రెడ్డి, ఆ రావు, ఈ నాయుడు, ఆ దొర, అందరు అభివృద్ధి మంత్రమే జపిస్తున్నారు. వాళ్ళు గతంలో పదవుల్లో ఉన్న కాలంలో వాళ్ళ కుటంబ సభ్యులు, వాళ్ళ స్నేహితులు ఎంత అభివృద్ధి అయ్యారో, ఎంత డబ్బు పోగు చేసుకున్నారో పత్రికలు రాస్తూనే ఉన్నాయి.

## ఎన్నికల సమయంలో మన సమస్యల పరిష్కారానికి వారిపై ఒత్తిడి తీసుకొద్దామా!

- హైదరాబాద్ నగరం మాదే అని తెలంగాణ వారు అంటే, మేం అభివృద్ధి చేయలేదా? అని సీమాంధ్ర ప్రాంతంవాళ్ళు వాదులాడుతున్నారు. అసలు హైదరాబాద్ నగరానికి వంద ఏళ్ళ క్రితమే ప్రపంచ చరిత్రలో పేరున్న నగరం అనేది ఎంత వాస్తవమో గత 30 ఏండ్లుగా అభివృద్ధి పేరుతో నాశనం కావడం అంతే వాస్తవం. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత దాన్ని



విశ్వనగరంగా రూపుదిద్దుతామని ప్రకటనలు చేస్తున్నారు. హెచ్.ఎం.డి.ఎ పరిధిలోకి తెచ్చిన అయిదు జిల్లాలకు చెందిన 54 మండలాలలోని దాదాపు 500 పై గల గ్రామాలు ఆయా జిల్లాలలోనే ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. మీ పార్టీ గెలిచిన తర్వాత ప్రజల కోరిక ప్రకారం ఆ మండలాలను ఆయా జిల్లాలలోనే ఉంచే విధాన పరమైన నిర్ణయం తీసుకుంటుందా?

- హైదరాబాద్ ఒకప్పుడు ఉపాధికి కేంద్రంగా ఉంది. గత 15 ఏళ్ళలో 20కి పైగా ప్రభుత్వ రంగ సంస్థలు, రెండు వేల పైచిలుకు చిన్న పరిశ్రమలు మూతపడ్డాయి. కనీసం మూతపడ్డ చిన్న పరిశ్రమలకు జీవంపోసే ప్రయత్నం మీ పార్టీ చేస్తుందా? జీవనోపాధికి హామీ ఇవ్వకుండా, నిర్దిష్టమైన ప్రణాళికలు చేపట్టకుండా ఉద్యోగాలు కల్పిస్తామంటే మేమెట్లా నమ్మాలి. ఈ విషయంపై వివరణ ఇస్తారా?

- నగరంలో చిన్న వర్షం పడ్డా జనజీవనం అస్తవ్యస్తమైపోతుంది. నాలాలు, చెరువులను రాజకీయ నాయకులు, రౌడీలు పలుకుబడి గలవారు ఆక్రమించుకున్నారు. జరిగిన పొరపాట్లను, అతిక్రమణలను గుర్తించి సరిచేస్తారా? మీరెన్నికైన తర్వాత మీరు/ మీ పార్టీ ప్రతినిధులు ఉన్న పరిస్థితిని ఇంకా అధ్వాన్నంగా చేయరని ప్రజలకు విశ్వాసం ఎలా కలిగిస్తారో, చెప్పగలరా?

- నగరంలోంచి ప్రవహించే మూసీ భారీ కాలుష్యానికి గురౌతుంది. నగర మురికి నీరే కాకుండా, పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా మూసీలోకి కలుపుతున్నారు. మూసీలోని మురుగు నీటిని శు భ్రపరిచేందుకు నిర్మించిన జలశుద్ధి కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేయడంలేదు. నది క్రింది భాగంలో ఉన్న దాదాపు 70 చెరువులకు పోయే ఈ నీటిని శుభ్రపరిచేందుకు సమగ్రమైన పథకం తయారుచేసి నిజాయితీగా అమలు పరుస్తామని హామీ ఇస్తారా?

- నగరంలో ప్రజారోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా తయారైంది. జంట నగరాల్లో ఉన్న 118 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 5 ఏరియా ఆసుపత్రులు, పది పెద్ద ఆసుపత్రుల్లో మౌలిక సౌకర్యాలు, తగినంత సిబ్బందిలేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు దేవాలయాలుగా భావించే ఈ ప్రభుత్వ ఆసుపత్రులను బాగు చేస్తారా? ప్రభుత్వ ఆసుపత్రులను పూర్తిగా పేదలకు వదిలేసిన మీరు / మీ పార్టీ పెద్దలు / మీ బంధువులు ప్రైవేటు ఆస్పత్రులకు పోవడం మానివేసి ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రజలతోబాటు వెళ్తారా? మీరు అంతధైర్యం చేయగలరా?

# మీరు గతంలో ఇచ్చిన హామీలు అట్లాగే వున్నాయి ... ఇప్పుడూ ... ఇంతేనా .... అని అడుగుదామా?

■ విద్యాహక్కు చట్టం వచ్చింది. కాని ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా నాశనమైన స్థితిలో ఉన్నాయి. చాలా స్కూళ్ళకు పక్కాభవనాలు లేవు. నగరంలోని దాదాపు 200 పాఠశాలల్లో మంచినీటి సరఫరా, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. మీ పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు, కార్పొరేట్ స్కూళ్ళకు పంపిస్తూ, ప్రభుత్వ పాఠశాలలను పేదలకు వదిలేశారు. మీ పార్టీ / మీరు ఈ విషయాన్ని పట్టించుకుంటారా?

■ మున్సిపల్ బడ్జెట్‌లో 40% నిధుల్ని పట్టణంలో పేదలకోసం ఖర్చుపెట్టాలనే ఆదేశాలు కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది. అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా 2008లో ఒక జీవో జారీ చేసింది. కాని ఇంత వరకు దాని ప్రకారం నిధుల వినియోగం జరగడం లేదు. మీరు అధికారంలోకి వస్తే ఆ ఆదేశాలను అమలు పరుస్తారా?

■ కేంద్ర ప్రభుత్వం 2017 కల్లా దేశంలోని 178 పట్టణాలను మురికి వాడలు లేని నగరాలుగా తీర్చిదిద్దుతామని **రాజీవ్ ఆవాస్ యోజన (RAY)** అనే మిషన్ ప్రకటించింది. జంటనగరాలలో దాదాపు 18 లక్షల మంది పేదలు రెండువేల పైచిలుకు బస్తీలలో నివాసముంటున్నారు. వాళ్ళ నివాసాలపై వాళ్ళకు హక్కులు లేవు. వాళ్ళకు మౌలిక వసతులు సరిగ్గా లేవు. రాష్ట్ర ప్రభుత్వం 1472 బస్తీలను గుర్తించి, అందులో నివసించే వారికి హక్కులు కల్పించి, గృహాలు నిర్మిస్తామని ప్రకటించింది. కాని ఇంకా పని మొదలు కాలేదు. మీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదల నివాస హక్కుల చట్టాన్ని తెచ్చి బస్తీలను అభివృద్ధి చేస్తారా?

■ జంటనగరాలలో దాదాపు 20 వేల మంది వీధి వ్యాపారస్తులున్నారు. వారిపై పోలీసుల, మున్సిపల్ అధికార్ల జులుం వల్ల అభద్రతతో జీవనం గడుపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారస్తుల జాతీయ రక్షణ చట్టం తెచ్చింది. ఇందుకు అనుగుణంగా కూడా రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా బిల్లు తయారు చేసింది. దానికి చట్ట రూపం ఇచ్చి వీధి వ్యాపారస్తులకు మీ ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందా? వాళ్ళకోసం చట్టంలో చెప్పినట్టుగా వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేస్తారా?

■ నగరంలో 40% మందికి మాత్రమే జలమండలి నిరంతరాయంగా త్రాగు నీటి సరఫరా చేస్తుంది. తక్కినవారికి అరకొర నీళ్ళందుతున్నాయి. శివారు బస్తీలలో, నగరంలోని పేదల బస్తీలలో తాగు నీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీని అభివృద్ధికి మీరు చర్యలు చేపడ్తారా?

■ 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం వార్డు కమిటీలు, ఏరియా సభల ద్వారా వార్డులకు సంబంధించిన సమస్యలపై నిర్ణయాలు జరగాలి. రాజకీయ పార్టీల ప్రతినిధులు, కార్పొరేటర్లు, ప్రాబల్యంగల పెద్దలు వార్డు కమిటీ, ఏరియా సభల సమావేశాలు జరగనివ్వడం లేదు. ఈ కీలకమైన నిర్ణయాధికారం విషయంలో ప్రజల భాగస్వామ్యం, ప్రజాస్వామిక ప్రక్రియ కొనసాగింపుకు దోహదం చేస్తారా? ఎప్పటిలాగా ఈ ప్రక్రియను అడ్డుకుంటారా?

■ మద్యం దుకాణాలు నడుపుకోవడానికి నిబంధనలు పాటించకుండా విచ్చల విడిగా రోడ్లపై అనుమతులిచ్చి ప్రజల ను ఇబ్బందులకు గురిచేసారు. పేదల బస్తీలలో అక్రమ మద్యం, గుడుంబా, మాదక ద్రవ్యాల అమ్మకం జరుగు తుంది. ఈ వ్యవస్థను సమీక్షించి పరిస్థితులు చక్కబరుస్తారా?

■ నగరంలో చెత్త సమస్య తీవ్రంగా ఉంది. పారిశుద్ధ్యం పరిస్థితి దినదినం దిగజారి పోతోంది. **రాంకీ కంపెనీ** కి చెత్తను అప్ప చెప్పి హైదరాబాద్ మున్సిపాలిటీ చేతులు దులుపుకుంది. పారిశుద్యాన్ని, కార్మికులను ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్ప చెప్పేసింది. చాలీచాలని జీతాలతో మున్సిపల్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మీ ప్రభుత్వం అధికారంలోకొస్తే మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేసి చెత్తను పరిశుభ్రపరిచే సమగ్ర విధానం రూపొందిస్తుందా?

■ నగరంలో రౌడీయిజం బాగా పెరిగిపోయి, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, మంత్రులే రౌడీల్లా వ్యవహరించిన సంఘటనలు, పోలీసులపైనే దౌర్జన్యం చేసిన సంఘటనలు జరిగాయి. మీరు గెలిచిన తర్వాత ఇట్లానే ప్రవర్తిస్తారా?

■ హైదరాబాద్, రంగారెడ్డి కలెక్టర్లు నగరంలో ఆక్రమణకు గురికాగా మిగిలి ఉన్న ఖాళీస్థలాలను గుర్తించి జాబితా తయారు చేశారు. వాటిని మీరు గానీ / మీ అనుచరులు గాని కబ్జా చేయమని హామీ ఇస్తారా? వాటి రక్షణకు చర్యలు చేపడతారా?

ఇంకా అడగడానికి చాలా సమస్యలే ఉన్నాయి. **స్త్రీలపై హింస, పేదలపై, ముస్లిం యువకులపై పోలీసుల వేధింపులు, పాత బస్తీలోని ప్రత్యేక సమస్యలు, ప్రజా రవాణా, నిత్యావసర సరుకుల సరఫరా వ్యవస్థ, అంగన్ వాడీలలో జరిగే అవకతవకలు** ... ఇట్లా ఇంకా ఎన్నో ... ఇవన్నీ అడగడానికి ఇదే సరైన సమయం. ప్రజలు ఈ అవకాశాన్ని వాడుకోవాలి. అయిదేళ్ళు హాయిగా ప్రతినిధిగా ఉంటామని నాయకులు భరోసాతో ఉంటున్నారు. మూడేళ్ళ తర్వాత ప్రజలు ఎన్నుకున్న నాయకుడి పనిని సమీక్ష చేసి, చట్టసభల నుంచి వెనక్కి రప్పించే (Right to Recall) చట్టం తేవాలనే ఆలోచన ప్రజాస్వామిక వాదులు ముందుకు తెస్తున్నారు. **ప్రజాప్రతినిధులారా తస్మాత్ జాగ్రత్త, ఎన్నుకున్న ప్రజలకు మిమ్మల్ని దించేసే హక్కు రాబోతోంది.**



**మానవ హక్కులవేదిక** – జంటనగరాల శాఖ
**Human Rights forum** (HRF) - Twin Cities Unit

20 ఏప్రిల్ 2014
ప్రచురణ కర్తలు : సయ్యద్ బిలాల్ – 9247498460, కార్తీక్ – 9346677007